వాన నీటి చుక్క పడి చుట్ట ఆరిపోయింది. రాములు ఆశగా తల పైకెత్తి చూశాడు. మబ్బులు బాగానే కమ్ముకుంటున్నాయి. కాని ఎవడికి నమ్మకం! వాన రాకడ ప్రాణం పోకడ ఆ బ్రమ్మ దేవుడికే తెలవాల. మూడేండ్లాయె ఒక్కనాడన్నా జాడించి వాన కొట్టిందా? నిన్నా, మొన్నా ఒకపాటి జల్లులు పడ్డాయిలే. కాని ఏ పాటికి? కొల్లు సగానికి ఎండిపోయే ఉండె. రొండుపూటలా మంచినీళ్లకు కిన్నెరసానికి పోయి కావిళ్ళతో తేవాల్సి వొస్తుండె. గోదారి మాత్రం?

# గోదారి


## 'రఘు'

సగానికి సగం యిసకనే. ఆ సీతమ్మవోరికి రామచెంద్ర ప్రబువుకు కనికరం లేదు. నెల నెల టయానికి జీతాలు దీసుకునే గవుర్నమెంటు ఉజ్జోగస్తులు తప్ప ఎవడి పని బాగుంది? ఊళ్లో పెద్ద రైతులు పరవాలేదులే.



తనలాంటి బక్కచిక్కినోడికే మూడింది. కాడికి ఒక పక్క దున్నపోతు, రెండో పక్క వొట్టిపోయిన ఆవును కట్టి యవసాయం చేసేటోడికి ఎట్టా గడుస్తుంది? కూలోళ్లపని ఇగ చెప్పేదేముంది. మా తాలుక కరువు గొట్టుకుపోయిన ఇలాకా అని ప్రకటించాలని సర్పంచిగారు, యమ్మెల్యేగారు కాయితం రాసి కలెట్టరు గారికి పంపినారంట. ఆయన ఆ కాయితం ముక్యమంతిరికి పంపిండంట. ముక్యమంతిరి ప్రెదానమంతిరి డబ్బులీయడం లేదన్నడంట.

"దక్షిణ భారత దేశములోకెల్లా గోదావరి అతి పెద్దనది. కాని ఇందులోని నీరు తొంభైశాతము ఉపయోగపడకనే సముద్రములోనికి వృధాగా కలిసి పోవుచున్నది. ఈ నది దాదాపు వెయ్యిమీటర్ల ఎత్తున



సహ్యాద్రి కొండలలో పుట్టుచున్నది'' చిన్న కొడుకు శివుడు పుస్తకంలో పాఠం చదువుతున్నాడు. రాములు చెవులకు వాడు చదివే పాఠంకన్నా, చదివే పద్ధతి శానా యిష్టం.

రాములు ఆరిన చుట్టను తలపాగాలో సదిరి, ''ఇగో! పాల సర్వ దెచ్చియ్యి. దుడ్డె ఒర్లుతుంది'' అని ఇంట్లోకి కేకేసాడు.

''ఈ పర్వత సానువులు మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలోని త్రయంబకేశ్వర్ వద్ద ఉన్నవి. గోదావరి నది దాదాపు 1456 కిలోమీటర్లు ఆగ్నేయముగా ప్రవహించి బంగాళాఖాతములో కలియుచున్నది. 1852వ సంవత్సరములో సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు ఈ నదిపై ధవళేశ్వరం వద్ద ఒక ఆనకట్టను నిర్మించెను...''

కనకమ్మ రాతెండి గిన్నె తెచ్చిచ్చేసరికి రాములు దూడను విప్పేశాడు. అది ఆబగా పరుగెత్తి పాలు కుడువడం మొదలుపెట్టింది. వాన జోరు అందుకున్నది. 'హత్తెరి' అని నులకమంచం ఎత్తి గుడిసెలోకి తీసుకొని పరుగెత్తాడు. పుస్తకాలు తీసుకుని శివుడు కూడా లోపలికి ఉరికాడు.

''అయ్యా!''

''ఏందిరా?''

''బంగాళాఖాతంల వాయుగుండం ఏర్పడిందట. అది కళింగపట్నం దగ్గర ఉందట...''

''కళింగపట్నం ఎక్కడరా?''

శివుడు బుర్ర గోక్కున్నాడు.

''ఏమో నాకు తెలవదు.''

''అయితే?''

''గొప్ప జోరుగ వానలు పడుతయట-మా పంతుళ్ల అనుకుంటుంటే యిన్నా.''

''పడనీ రాదుర. ఎండిపోతున్న నార్లన్న దక్కుతయి.''

వల్లెటి వాననీళ్లకు తడుస్తూ అరమోడ్పు కన్నులతో, పాలుకుడుస్తున్న దూడ స్పర్శకు పరవశిస్తున్నది బక్కచిక్కిన బర్రె. రాములు కంగారుపడ్డాడు. దీనియక్క. పాలన్నీ చీకేస్తదా ఏంది? పాత్ర పట్టుకొని బర్రె దగ్గరకు పరుగెత్తి దూడను లాగడానికి చూశాడు. మధ్యలో సర్రున కాలుజారి పడబోయి తమాయించుకున్నాడు.

కనకమ్మ కిసుక్కున నవ్వింది. ''యీ ఒక్కపూటకు ఒదిలిపెట్టరాదు పాలు దూడకు'' అంది.

రాములు ఒక్క క్షణం గుంజాటన పడి వెనుకకు వచ్చేశాడు.

చీకటిపడింది. కనకమ్మ లాంతరు బుడ్డీ వెలిగించింది.

''శాంతమ్మ ఇంకా రాకపాయె?'' అంటూ బయటకు చూసింది.


కుండపోతగా కురుస్తున్న వాన ధారలు తప్ప ఏమీ కనిపించడం లేదు.

శాంతమ్మ ఒక్కతే వాళ్లకు ఆడపిల్ల. పెద్దమనిషి కాకముందే పెండ్లి చేశారు. పెద్దమనిషి అయింది. మరి రెండేండ్లకు నీళ్లపోసుకొని నీళ్లాటకు తల్లిదగ్గరికి వచ్చింది. మూడు రోజుల నుండి కోమటి లింగమూర్తి ఇంట్లో బియ్యం చెయ్యడానికి పోతున్నది. రోజుకు శేరు సూకరిస్తారు.

రాములు మళ్లీ చుట్ట వెలిగించి ఆలోచనలో పడ్డాడు. య్యాక. ఈ వానకు ఉన్న ఎకరం నాలుగు గుంటల పొలంల నారు వృద్ధి గావాల. కుంట నిండుతే చాల్లే. మూడు పుట్లు పండుతే ముత్యాలమ్మకు కోడిని కోస్తే. పెద్దోడు నరసింవులు జక్కం వెంకటావయ్య మిల్లులో బియ్యం బస్తలు మోస్తడు. వాడు నిజంగా సీరామ చెంద్రుడే. ఓ చుట్ట దాగడు. ఓ బీడి దాగడు. కల్లు దాగడు. సార దాగడు. కాని ఆదివారం ఆదివారం బద్రాచెలం పోయి గోపాలకిష్ణ కలామందిరంల కొత్త సీన్మ చూసి రావల. అది వాడి పద్దతి. వాడి కీయేడు లగ్గం చెయ్యాల. నగరం నుండి సంమందం ఒకటొచ్చింది. యెయ్యి నూట పదహార్లు యిస్తమన్నరు. బలువు. ఇష్టీలు కంచం గలాసు... కుదుర్చుకుంటె బాగనే ఉంటది.

చిన్నోడు శివుడు శివుడే. తోటకూర బుర్లినాయుడు గారింట్లో జీతానికి కుదిరిస్తే ఉన్నన్ని రోజులు బాగనే ఉన్నడు. ఇంటిపని, పాచిపని, కొట్టంపని, గొడ్లను మేపక రావడం, పక్కలెయ్యడం, పాలుపిండటం - వాడి యీడుకు మించిన పని చేసేటోడు. నాయుడుగారికి గిరిజన గవర్నమెంటు ఆపీసువోళ్ల తెలుసు. శివుడికి రెండు కాకీ లాగులు, అంగీలు ఎవరి పేరుమీదనో రాయించి ఇప్పించిండు. కాని యీడికే బుద్ది సమంగా నిలవలా. నాయుడుగారి మనమలు సదూకుంటుంటే యీడికే కుశాలు పుట్టె పని మానేసి పారివొచ్చిండు. వాడి బాధ పడలేక పంతులుగారిని బతిలాడుకొని బడిలో చేరిపించిండు. ఆశ్చెర్యమేందంటే వీడు ఒక్కొక్క

1986 అక్షయ దీపావళి
కథల పోటీలో
రూ.1500/-లు
మొదటి బహుమతి
పొందిన కథ




కలాసు మంచిమంచిగ పాసవుకుంట పైకి వొస్తున్నదు. పంతుళ్లే బుగ్గలు వొత్తుకుంటున్నరట వీడి తెలివి తేటలకు.

"యిగో. ఒకసారి లింగయ్య యింటికి బోయి శాంతమ్మను తీస్కరారాదు" బుగులుగా అంది కనకమ్మ.

"ఎహే. వాన తగ్గినంక అదే వచ్చుద్దిలే" విసుగ్గా అన్నాడు రాములు, తిరిగి ఆలోచనలో మునుగుతూ.

కనకమ్మకు భయం భయంగా ఉంది. వాన తగ్గటం కాదుకదా ఇంకా జోరు ఎక్కువైంది. తాటాకు చూరు నుండి జారుతున్న వాన నీళ్ల కాలవలు కట్టి పల్లంలోకి పోతున్నవి. ఒక ఉరుము లేదు. ఒక మెరుపు లేదు. గాలి జోరు ఎక్కువ లేదు. కుండపోత.

రాములుకు, శివుడికి జొన్న అంబలి గిన్నెలు అందించింది. కాళీచేసి నీళ్లుతాగి మంచంమీద వొరిగాడు రాములు. చూరులోంచి కారుతున్న నీటి చుక్కలకు తడవకుండా పుస్తకాలను దాచే ప్రయత్నంలో ఉన్నాడు శివుడు. చెంగుపరుచుకొని కటిక నేలమీద పడుకుంది కనకమ్మ. బొంత పరుచుకుని వెల్లికిలా పడుకుని ఆలోచనల్లోంచి నిద్రలోకి జారుకుంటున్నాడు శివుడు.

రాములుకు కునుకు పట్టలేదు. గంటలు గడిచాయి. దడివారగా వేసిన బీర పందిరి కూలిపోయింది. కాసేపటికి దడి కూడా ఒరిగిపోయింది.

చప్పుడుకు కనకమ్మ దిగ్గున లేచి కూచుంది. "పోయి శాంతమ్మను తేపో- లేకుంటే నేను చస్తా."

రాములు అయిష్టంగా లేచాడు. 'ముండ. తను పట్టిందే పట్టు.' గోనెపట్టా నెత్తిన వేసుకొని బయట పడ్డాడు.

ఈ కటిక చీకట్లో దారి కనపట్టం లేదుగదా. మోకాళ్ల దాకా నీళ్లు. కాళ్లు లాగుతుంటే బరువుగా ఉందే. ఈ రాత్తిరి నన్ను బయటకు తరుముకుంటే దీనికేం ఆపదొచ్చింది! గొల్లల గుడిసెలు కూలినట్లున్నయి. మ్యాకల అరుపులు ఆగటం లేదు. కంపువాసన. ఒకటి రెండు బలిసిన గొల్లదొరల ఇండ్లల్ల తప్పితే ఎవడింటికి కరెంటు లేదు. అవీ పోయినట్టున్నయి. బజారు లైట్లు ఉత్తప్పుడే ఎలగవు. ఇప్పుడు మాత్తరం వాటికి నా మీద ప్రేమ కారిపోతదా?

అదాటున నడుస్తున్న రాములు కుడికాలులో కసిక్కున ముల్లు దిగింది. నీళ్లలోంచి కాలు పైకి తీశాడు. సర్కారు తుమ్మ. మందతోపాటు ఉంది. ఒంటికాలు మీద నిలబడి బలంగా లాగేశాడు. ముల్లు వచ్చేసింది. ముల్లుతోపాటు నెత్తురు చివ్వున వచ్చింది. కాని కాలు పట్టుతప్పి నీళ్లల్లో అడ్డంగా పడ్డాడు. గోనె పట్టా నెత్తిమీద నుండి తొలగి నీళ్లల్లో పడింది. తడిసి బరువెక్కింది మోకాళ్ల దాకా కట్టుకున్న దోతి, ముతక గుడ్డ బనీను తడిసాయి. తడబడుతూ లేచి నిల్చున్నాడు. గోనెపట్టా పిండినంతవరకు పిండి మళ్లీ నెత్తిన వేసుకున్నాడు. ముఖం మీదికి సూటిగా కొడుతున్న జల్లుకు చెయ్యి అడ్డం పెట్టుకుని నడక మొదలు పెట్టాడు.

పది అడుగులు నడిచేసరికి రాములు కాళ్లు నిలిచి పోయినయి. నడిరోడ్డు మీద నిలబడ్డాడు కొంచెంసేపు.

అలవాటు పడ్డ ప్రాణం. అక్కడికి రాంగనే నిలబడి పోయింది. ప్రెబుత్వ సారాయి దుకాణం ఏం బాయె ఒక సుక్క ఏసుకుంటే ఈ వానల? ప్రాణం వెచ్చగుంటది.

ఓరగా వేసి ఉన్న తలుపు నెట్టి లోనికి అడుగు పెట్టాడు. గుడ్డి దీపం వెలుగులో సంగయ్య మోకాళ్ల మీద తలపెట్టుకుని కూచుని ఉన్నాడు.

సంగయ్య పెండ్లాం రత్తమ్మది భారీ కాయం. నులక మంచం మీద అడ్డదిడ్డంగా పండుకొనుంది. సగం కళ్లు సగం నోరు తెరిచి అసయ్యంగా గుర్రుకొడుతున్నది.

"సంగయ్య మావా"

"ఎవరు?" తలఎత్తి చూశాడు.

"నేను రాములును. జంగం రాములును."

సంగయ్య మాట్లాడలేదు.

"ఒక వంద..."

"ఇప్పుడా?"

"ఇప్పుడే మరి. కుశాలుకు"

"ఉద్దెర లేదు."

రాములు బుర్రగోక్కున్నడు.

"నేనెప్పుడైనా ఎగ్గొట్టిన్నా?"

సంగయ్య ఒక వంద పోసి ఇచ్చాడు.

"తినడానికి ఏమీలేదులే."

రాములు మారు మాటడకుండా గటగటా తాగి ముంజేతితో మూతి తుడుచుకున్నాడు. మీసాలు సర్దుకున్నాడు.

"సంగయ్య మావా. య్యక. ఇన్నాళ్లకు బలే వానలే. నా పొలంల నారు ఎండిపోతా ఉండె. ఈ దెబ్బకు మళ్ల పచ్చగ కావాలె."

సంగయ్య బీడి వెలిగించి రాములుకు ఒకటిచ్చాడు. రాములు బీడి వెలిగించాడు.

"ఇగ నుంచి సార సీసలల్ల సరపరా జేస్తరట" సంగయ్య దిగులు గొంతుతో అన్నాడు.

రాములు ఒకసారి దగ్గి, గొంతు సవరించుకొని "ఉంకో వంద పొయ్యి మావ! నీ రుణం ఉంచుకోను" అన్నాడు.

సంగయ్య అందించాడు.

రాములు తాగాడు. య్యక. ఇప్పుడు బాగుంది.

"వొస్త మావ."

రాములు బయట పడగానే సంగయ్య ధడేలుమని తలుపు మూసుకున్నాడు.

"చెక్కరా చెక్క. చెక్కపొలియక్క..." పదం పాడుకుంటూ నడుస్తుంటే వానేంది? వరదేంది?

అరగంట సేపటిలో ఆరడుగులు నడిచాడు. ఇక లాభం లేదు. అప్పారావు కాఫీ హోటలు చూరు కింద కాళ్లు జాపి పండుకుంటే నిముషంలో నిద్దర పట్టింది.

రాములుకు తెలివొచ్చేసరికి తెల్లారి వుంది. వాన జోరు తగ్గలేదు. ఊరంతా జలమయం. గబిక్కున లేచి కూచున్నాడు. రాత్రి జరిగిందంతా గుర్తుకొచ్చింది. తల బరువుగా ఉంది. విదిలించి లేచి నిలుచున్నాడు. బట్టలు తడిసిపోయినాయి. గోనెపట్టా దులిపి నెత్తిన కప్పుకున్నాడు. నీళ్లలోకి దిగి నడక సాగించాడు.

వానదారల్లో ఎదురుంగా వొచ్చేది ఎవరది? రాములు గుచ్చి గుచ్చి చూశాడు. మాదిగ కొమరయ్య. బుడ్డగోచీ తప్ప ఒంటిమీద గుడ్డ లేదు. నెత్తిమీద గిన్నెలు కట్టిన గోనెసంచి, సంకలో వేలాడుతున్న జొన్నల మూట. పక్కనే నడిచొస్తున్న వాడి పెండ్లాం ముత్తి. తడిచిన చాలీ చాలని కోక. సంకలో రెండేండ్ల పసిబిడ్డ. వాన నీళ్లు నెత్తిమీద పడి మొకం మీదికి పారి గాలి సమంగా ఆడక ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు బిడ్డ. కొమరయ్య చేతిలో, ముత్తి చేతిలో మూరెడు మూరెడు వంకర టింకర కర్రలు ఉన్నాయి. నాలుగు పెద్ద పందులు, మూడు పంది పిల్లలు నీటి పైబాగానికి ముట్టెలు తేర్చి బుస్సు బుస్సున గాలి వదులుతూ ఈదుకుంటూ వొస్తున్నాయి. కొమరయ్య, ముత్తి అవి దారి తప్పకుండా అరుస్తూ ఒగరుస్తూ కాళ్లీడుస్తున్నారు.

"మాదిగ్గూడెంల గుడిసెలు కూలినయి... ఏసోబు తల్లి ముసల్ది సచ్చిపోయింది..."

రాములు వాళ్లు వెళ్లిపోయిన వైపే చూస్తూ నిలబడి పోయాడు. ఇంకా వెనుక జనాలు వొస్తున్నారు- మూటాముల్లె, తట్టా బుట్ట నెత్తిన పెట్టుకొని.

రాములు బయల్దేరాడు. రేపాక లింగమూర్తి ఇంటికళ్లే సందులో మోకాలు పైకి నీళ్లు. బొడ్డుమల్లె చెట్టు కూలి

దారికి అడ్డంగా పడి ఉంది. కొమ్మలు దాటుకుని ఇంట్లోకి వెళ్లాడు.

జీతగాడి సాయంతో బస్తాలోకి గిన్నెలు, గ్లాసులు, చెంబులు గంటెలు నింపిస్తున్నాడు లింగమూర్తి. ఆయన భార్య పరమేశ్వరమ్మ నేల మీద వదికిల కూర్చుని బియ్యం, పప్పులు, ఉప్పు మూట కడుతున్నది. కూతురు పుష్పవతి చంటి పిల్లాడికి సీసాతో పాలు పడుతూ రేడియో వింటున్నది.

లింగమూర్తి రాములుని చూసి మళ్లీ తల తిప్పుకుని పనిలో నిమగ్నుడయ్యాడు.

''ఏంది రాములూ. ఇటొచ్చినవు''

రాములు నోరు తెరిచి ''మా శాంతవ్వ ఉందా...'' అన్నాడు. అప్పటికే నమ్మిక కుదిరింది. ఉంటే కనపడదా.

''అయ్యో నిన్న సాయంత్రమే పోయె గదా...'' అన్నది పరమేశ్వరమ్మ. ''నిన్న నా పాత రైక ఒకటుంటె యిస్తిని''

రాములు నిలబడిపోయాడు.

''మా అల్లుడు ఖమ్మం పోయిండు మొన్న. నిన్ననే రావల్సి ఉండె. వైరా కాలువ పొంగుతుందంట. మున్నేరు వాగు దాటనీయటం లేదట. ఇగ కిన్నెరసాని బిరిడ్జి మీద నుండి పారుతుందట. ఎట్లొస్తాడో ఏమో!''

రేడియోలో చెబుతున్నారు.

''భద్రాచలంలో 27 సెంటీమీటర్లు, కొత్తగూడెంలో ఇరవై ఒకటి, దుమ్ముగూడెంలో పంథొమ్మిది సెంటీమీటర్లు రికార్డయింది.లోతట్టు ప్రాంతాల లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు...''

రాములు వెనుకకు మళ్లి తలుపుదగ్గరికి వచ్చేసరికి లింగమూర్తి పిలిచాడు.

''రేయ్ రాములూ ఇట్రారా... ఈ మూట నెత్తుకొని మా ఎంట రారా... నీ కష్టం ఉంచుకోములే''

రాములుకు కింది నుండి కాలుకొచ్చింది. య్యాక. ఒక పక్క నా బిడ్డ యాడ బాయెనో అని నేనేదుస్తుంటే వీళ్ల మూటలు మోసుక పోవాలంట.

''రాములూ! శాంతమ్మ ఎక్కడికీ పోదులేరా, ఈ చంటిపిల్ల తోటి పోవుడు కష్టమవుతదిరా మాకు. బాబ్బాబు ఈ సామను సాయం పట్టరా'' పరమేశ్వరమ్మ బతిమలాడింది.

లింగమూర్తి బనీనులోపటి జేబీలో నుండి పది రూపాయిల కాయి .ం తీసి రాములు చేతిలో పెట్టాడు.

నోటు చూడగానే రాములు మెత్తబడ్డాడు.

ఆలుమగలు గుసగుసలాడుకున్నారు.

''పైసలన్ని ఎక్కడ పెట్టినవు?'' గుచ్చి గుచ్చి అడిగింది పరమేశ్వరమ్మ.

''ఏహే. లోపటి జేబిలో పాతంగ పెట్టినలే.''

''ఎంత?''

''మూడు వేలు...'

''చిన్నగ మాట్లాడు. వాడు వినగలడు.''

పరమేశ్వరమ్మ, పుష్పవతి మెడనిండ నగలు వేసుకున్నారు. కాసుల పేర్లు, పెద్ద గొలుసులు, చంద్ర హారాలు, చేతులకు ఆరేసి గాజులు. ముక్కు పుడకలు, దుద్దులు మిగిలిన వడ్డాణం బంగారం మురుగులు, వెండి సామాను బరిణలు మూట కట్టుకుని పరమేశ్వ రమ్మ పట్టుకున్నది.

ఇంటికి తాళం వేసి ఒకటికి నాలుగుసార్లు లాగి చూసి బయలు దేరాడు లింగమూర్తి.

ఒక్క గొడుగులో తల్లీ కూతుళ్లు ఒదిగి నడుస్తున్నారు.

రాములు నెత్తిన మూటతో వెనుక నడిచాడు.

వానజోరు తగ్గలేదు. ఇగ జల ప్రళయమే వచ్చేటట్టుంది. పాపం పెరిగిపోయింది ప్రెపంచంల. అమ్మకు అయ్య లేదు. అయ్యకు బిడ్డలేదు.

ఉన్నట్టుండి పుష్పవతి కేకవేసింది.

పరమేశ్వరమ్మ కంగారు పడ్డది. ''ఏమైందే బిడ్డా? ఏమైంది?''

''పాము... తాసుపాము నా కాళ్ల మజ్జలొంచి పోయింది.''

రాములుకు నవ్వొచ్చింది. ''అదుట్టి నీరుకట్ట. కరువదు'' అన్నాడు.

అయినా ముగ్గురూ భయం భయంగా జాగ్రత్తగా నడుస్తున్నారు.

గవుర్నమెంటు వారు పేదోళ్లకు కట్టించిన ఇండ్ల వరుసలు చేరుకున్నారు. ఇండ్లలోకి నీళ్ల పోయి అంతా ఏకం అయింది. యెరుకలోళ్లు చిన్న బండ్ల మీద సామాన్లు వేసుకొని కోడె దూడలను అదిలిస్తున్నారు.

ఊరి బయట వెంకటరెడ్డి కోళ్లఫారంలోకి నీళ్ళు పోయినాయి. సగం కోళ్లు చచ్చినాయి. సగం కొస ప్రాణంతో నీళ్లల్లో టపటప కొట్టుకుంటున్నాయి. పోరగాళ్లు నీళ్లను లెక్కచెయ్యకుండ చేతికందినన్ని కోళ్లు అందుకొని ఉడాయిస్తున్నారు.

''లవ్జడ్డీ కొడుకులు. దొంగబుద్ధి పోదు ఆపద సమయంల కూడ...'' లింగమూర్తి బూతులు తిడుతున్నడు.

రాములుకు కూడా ఒకటి రెండు కోళ్లు చేజిక్కించుకోవాలని ఉంది. కాని లింగమూర్తి తిడుతుంటే జంకాడు.

రైసు మిల్లు కాడికొచ్చేసరికి రాములు ఆశగా నిలబడి పోయాడు. మిల్లు ముందు లారీ ఆగి ఉంది. ముగ్గురు కూలీలు బస్తాలు లారీలకు లోడు చేస్తున్నారు. అందుల నరసింవులు లేదు.


వెంకట్రామయ్య కొడుకు బోసుబాబు పంచె పైకి ఎగదోసి గొడుగు పట్టుకొని పై మెట్టు మీద నిలుచుని అజమాయిషి చేస్తున్నాడు.


''ఒరే బిచ్చంగా! మా నరసింవులు లేదురా?'' రాములు గొంతు పెగుల్తానే లారీ డ్రైవరు ఒకసారి ఇంజను బుర్రుమనిపించాడు. ''అవ్వల్ రైట్. మన లారీ ఎంత దూరమంటే అత దూరం ఫస్టుక్లాసుగ పోతది.''

''పోతది సరే. బియ్యం బస్తాలు తడవకుండా టార్పాలిన్ సరిగ్గా కప్పండి'' అన్నాడు బోసుబాబు.

బిచ్చంగాడు రాములు దగ్గరికి వచ్చాడు. ''నరిసింవులు సేన్మ జూడటానికి బద్రాచెలం పోయెగదా. మళ్లీ రాలె. గోదారి వరదొస్తుంది కదా. బిరిడ్జి మునిగిపాయె.''

రాములు పెదిమల మీద పడిన నీటిని నాలుకతో



తుడుచుకుని నిలబడి పోయాడు.

కొంతదూరం పోయి వెనుకకు తిరిగి చూసిన లింగమూర్తి "ఓ(రాములూ. రావేందిరా" అన్నాడు.

రాములు గబగబా నడిచాడు.

మరి రెండు ఫర్లాంగులు నడిచేసరికి కాస్త ఎత్తయిన ప్రదేశం వచ్చింది. లింగమూర్తి గొడ్ల చావిడి అది. అప్పటికే అందులో పది కుటుంబాల దాక ఉన్నాయి. లింగమూర్తి ముక్కు విరిచాడు. "ఇంత యాడికెళ్లి వచ్చిన్రు నా ప్రాణానికి. ఉండమనేటట్టులేదు. పొమ్మనేటట్టు లేదు."

రాములు మూట కిందపడేసి "నేనొస్త సేటూ" అని అన్నాడు.

"నాయినా వాడికింకో పది రూపాయలియ్యవే" అంది పుష్పవతి.

ఒకసారి కొరకొరా కూతురు వైపు చూసి ఐదు రూపాయలు తీసి యిచ్చాడు లింగమూర్తి.

ఆగమేగాల మీద పోవాలె. నా బిడ్డను జూసుకోవాలె. శివుణ్ని, కనకమ్మను తీసుకుని ఎత్తు ప్రదేశానికి పోవాలె.

రాములు ఆవేశానికి తగినట్టుగా అడుగులు పడటం లేదు. వాన జోరు ఎక్కువైంది. నీరు తొడల దాకా వచ్చింది.

"ఎవరూ? ఎవరది?" ఎదురుగా వొచ్చిన వెంకన్న అరిచాడు.

"నేను జంగం రాములును."

"జంగం రాములువా. మావా రాత్రి నీ బిడ్డ ఉతలకలాడింది మసీదుల. కాని పిల్లగుడ్డు సచ్చిపోయింది..."

రాములు నీటి తాకిడికి కాళ్లు తేలి నీటిలో పడ్డాడు.

"నేను పోత... మసీదు కాడికి పోత... నా బిడ్డను చూడాలె..." అరిచాడు.

"వద్దు పోకు. నీళ్లు బాగా పెరిగినయి. కొట్కపోతవ్" వెంకన్న అరిచాడు.

"నా బిడ్డ, నా బిడ్డ" అని రాములు పెద్దగా ఏడ్చాడు. వరద ఈడుస్తున్నది. కాళ్లు తేలిపోతున్నవి.


శాంతమ్మను మేనరికం అల్లుడు కోటయ్యకు ఇచ్చి చేసిండు. అల్లుడు బుద్ధిమంతుడు. బద్రాచెలం పేపరు బోరడు మిల్లులో పనిచేస్తడు. సారపాకలో రెండు గదుల పెంకుటిల్లున్నది.

శాంతమ్మ పురిటికొచ్చిన నాడే తల్లితో అంటుంటే తను ఇన్నాడు. "మగపిలగాడు పుడితే రామచెంద్రావని పేరెడతాడట. ఆడపిల్ల పుడితే జానికమ్మ అని పెడతాడట."

గోదారి నీరు ఇక్కడి దాకా వొచ్చిందంటే ఇంక సారపాక మిగుల్తదా? అల్లుడెంత విచారంలో ఉన్నడో! అసలున్నడో? ఛీ. ఎదవాలోచన.

రెడ్డిగూడెం, గుమ్మూరు మునిగిపోయుంటయి కిన్నెరసాని పొంగుతుంది.

రాములు నీళ్లల్లో కొట్టుక పోతున్నాడు. కాళ్లు ఆనటం లేదు. బలంగా ఈదటానికి ప్రయత్నం చేశాడు. కొట్టుకుపోతున్నాడు. రాములు పక్కకు తిరిగి చూశాడు.



## దీపం

అస్తమయ సూర్యుని భారం
ఆనందంగా నెత్తినేసుకొని-
కాంతి కిరణాల మువ్వలు
కాళ్లకు కట్టుకొని-
రేయంతా నా నట్టింట
మౌనంగా నాట్యం చేస్తుంది!
ఉదయ భానుడు నా వాకిటకోడై కూసేవరకూ
నా రస్తాలకు గస్తీ కాస్తుంది.

నీలాకాశపు వాకిట్లో సోకు చేసుకుంటూ
నిక్కి నిక్కి చూచే ముక్క కన్నెల అందాలకు
నీరాజనాలు పడుతుంది!
స్వాగతాలు పలుకుతుంది!

రాత్రి ప్రముచ్చిలించి ముసుగేసుకొచ్చిన
చిక్కని చీకటి కేన్వాసుపై
జిలుగు కిరణాల వింత కుంచెతో
వెలుతురు బొమ్మలు గీస్తుంది!

పగలు పిడికిలి బిగించి, ఆవేశంతో
నాపై నిప్పులు విసిరిన ఆకాశ హృదయం
ఈ రాత్రంత చల్లనిదని
ఈ వెన్నెలంత తెల్లనిదని-
ఇన్ని దోసిళ్ల మంచు మల్లెలు
నాపై జల్లుతుందని-
ఇన్ని రాసుల నక్షత్రాలతో
నన్నభిషేకిస్తుందని
ఊహించనే లేదు నేను,
దీపం నా కళ్లు తెరిపించే వరకూ!
ఇంటి సూర్యుని మినీ రూపం, దీపం!
చీకటి పెదవులపై పూచిన చిరునగవుల మొగ్గ!
రేయి నెన్నొసట తీర్చుకున్న తిలకం!
చీకట్ల పందిట్లో పచ్చతోరణం దీపం!
రస హృదయం ప్రసవించిన కవితా చరణం దీపం!

-మేకా మన్మధరావు

పెద్దరావి చెట్టు. మొదట్లో ఆంజనేయస్వామి విగ్రహం. పదడుగుల ఎత్తున్న రాయి మీద అస్పష్టంగా చెక్కిన ఆంజనేయ స్వామి విగ్రహం. పై కొమ్మ నుండి వేలాడదీసిన కంచుగంట. ఊరి ప్రజల మనసైన దేముడు.

నీళ్లు స్వామివారి గుండెల దాకా వచ్చాయి. తల, పైకి తిరిగిన తోక చివరి భాగం, గద పైభాగం మాత్రమే కనిపిస్తున్నాయి.

రాములు వాలుకు ఎదురీది చెట్టు మొదట్లోకి వచ్చాడు. కుడిచేత్తో విగ్రహాన్ని పట్టుకున్నాడు.

'అపరాధం శమించు సామీ. పాపాత్ముడిని. నీకు యెయ్యి దండాలు.' మనసులోనే అనుకున్నాడు. రెండు చేతులతో విగ్రహాన్ని పట్టుకుని దగ్గరగా జరిగాడు. కుడికాలు విగ్రహం మీద ఆనించి పైకి ఎక్కబోయాడు. విగ్రహానికి రాసిన అంజనానికి కాలు జారి పట్టుతప్పింది.

గదుమ చిట్లి నెత్తురు చిమ్మింది.

'పొరపాటు కాయిసామీ. నా ప్రాణం రక్షించు సామీ' రాములు ఈసారి పట్టు చిక్కించుకొని పైకి పోకాడు. రెండోసారి కుడి కాలు పైకి లేపాడు. ఆంజనేయసామి తలమీద రాముడి పాదం. తరువాత చెట్టును కావిలించుకుని నెమ్మదిగా పైకి పాకాడు. కొమ్మ అందుకొని పైకెక్కాడు. గొలుసు ఊపుతూ గంట చాలాసేపు కొట్టాడు. 'సెమించుసామి. రక్షించు సామి.''

అలుపొచ్చింది. కొమ్మ మీద బోర్లా పడుకున్నాడు. మళ్లీ లేచి చూశాడు. ఎక్కడా ఏమీ కనిపించడం లేదు. మైళ్లకు మైళ్లు నీళ్లు. దూరంగా బద్రాచల రాముడి గుడి గోపురం కనిపిస్తున్నది. ఊళ్లో ఉన్న పెద్ద బఫంతుల పైకప్పులు కనిపిస్తున్నవి. వాన తగ్గలేదు. పొద్దుగూకింది. చీకటయింది. నీటి చప్పుడు వాన హోరు తప్ప ఏమీ వినిపించడం లేదు.

మసక చీకటిలో కొట్టుకొస్తున్న తాటాకు గుడెసెలు, దుంగలు, బొంగులు, పశువుల శవాలు కనిపిస్తున్నాయి.

ఆంజనేయస్వామి విగ్రహం మునిగి పోయింది. నీరు రావిచెట్టు కాండం ముంచేసింది.

రాములుకు కడుపులో తిప్పుతోంది. ఇందాక నీటిలో కొట్టుకొచ్చేటప్పుడు అనుకోకుండానే అయిదారు గుటకలు నీళ్లు తాగేశాడు.

కడుపులో తిప్పి తిప్పి బొళుక్కున కక్కుకున్నాడు. కాస్త నిమ్మళంగా అనిపించింది.

కనకమ్మ యాడ ఉన్నదో. శివుడు యాడ వున్నడో- శాంతమ్మను కలువకపోతిని. థూ నీయవ్వ పాడు బతుకు.

రాములుకు బయలుకు వచ్చినట్టనిపించింది. కొమ్మ మీద వారగా కూచున్నాడు. నీళ్ల ప్రవాహంలా బయటపడ్డది. అయిపోయేసరికి కాళ్లు చేతులు వణుకుతున్నాయి. గొంతు తడి ఆరిపోతున్నది.

వాన. జల్లు. వరద. వాంతులు. విరోచనాలు.

రాములు పెద్ద కొమ్మ మీద బోర్లాపడుకున్నాడు. కనకమ్మా, శాంతమ్మా, నరసింవులూ, శివుడూ. నా పొలం. నా వొరినారు. నా వొరినారు. నా వొరనారూ.